క్లుప్తంగా

విద్యార్థులు మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలి
డీసీపీ మహేందర్


విద్యార్థినులతో డీసీపీ మహేందర్

సిద్దిపేట రూరల్: విద్యార్థులు బాగా చదివి మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని డీసీపీ మహేందర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఇర్కోడ్ తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని, ఈ రోజు తెలంగాణ మొత్తం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. విద్యార్థులకు పరీక్ష హాల్ టికెట్లు పంపిణీ చేసి, గత సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ప్రిన్సిపాల్ ఆర్.నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సీఎం కృషి


బొడ్రాయికి పూజలు చేస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దామరకుంట గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, సర్పంచ్ గాయత్రి బాల్‌నర్సయ్య ప్రతాప్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంజనేయులు, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సత్తయ్య, మహేశ్ యాదవ్ ,రమేశ్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ
వర్గల్(గజ్వేల్): మండలంలోని మక్తలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవత ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. అమ్మవారికి పూజలు చేశారు.

పౌష్టికాహారం పంపిణీ
బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగారావు శుక్రవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అంగన్‌వాడీసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మమత, అంగన్‌వాడి టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం
దుబ్బాక: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు చేపట్టిందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలోని 13వ వార్డులో కౌన్సిలర్ ఆస సులోచన, కోఆప్షన్ సభ్యుడు స్వామితో కలిసి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వాడీవేడిగా మిరుదొడ్డి సర్వసభ్య సమావేశం

- ఎంపీపీ, ఎంపీటీసీ మధ్య వాగ్వాదం
- నేలపై బైఠాయించి నిరసన తెలిపిన ఎంపీటీసీ నర్సింహులు


సర్వసభ్య సమావేశంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ నర్సింహులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల సభలో ఎంపీపీ, ఎంపీటీసీల మధ్య జరిగిన నిధుల కేటాయింపు విషయంలో తలెత్తిన వివాదం తారా స్థాయికి చేరింది. ఇరువురి మధ్య నువ్వెంతంటే నువ్వెంత అంటూ మాటల యుద్ధం కొనసాగింది. మిరుదొడ్డిలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వాడీవేడిగా చర్చ సాగింది. నిధుల కేటాయింపులో ఎంపీపీ గజ్జెల సాయిలు తనపై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ మిరుదొడ్డి ఎంపీటీసీ–1 సుతారి నర్సింహులు సమావేశం నుంచి వాకౌట్ చేస్తానని హల్‌చల్ చేశారు. ఎంపీటీసీలకు కేటాయించిన నిధుల మంజూరు విషయంలో సైతం ఎంపీడీఓ రాజిరెడ్డి పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ తాను ఎంపీటీసీ పదవికి రాజీనామా చేస్తాని నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సభా మర్యాదలను కాపాడకుండా వ్యవహరించడం సరికాదని ఎంపీపీ గజ్జెల సాయిలు ఎంపీటీసీపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీపీ, ఎంపీటీసీ మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వావాదం చోటు చేసుకుంది. కాగా ఎంపీపీ ఎంపీటీసీలు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు అయి ఉండి కూడా సమావేశంలో ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించడంపై సర్వత్రా చర్చానీయంశంగా మారింది. దీనిపై ఎంపీడీఓ రాజిరెడ్డి స్పందించారు. నిధుల కేటాయింపులో ఎంపీటీసీ నర్సింహులు స్థలం లొకేషన్ చూపించక పోవడవం వల్లనే నిధులు ఆగిపోయినట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా లోకేషన్ చూపించే విధంగా ప్రొసీడింగ్ అందజేస్తే రూ.2 లక్షల నిధులు మంజూరు చేయడానికి అవకాశం ఉందని తేల్చిచెప్పడంతో వాగ్వాదానికి తెరపడింది. తాగునీటికి ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయని మిషన్ భగిరథ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వీరారెడ్డిపల్లి సర్పంచ్ పన్యాల వెంకట్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రూ. 1.50 లక్షల ప్రొసీడింగ్ ఇస్తానని ఎంపీపీ సభాముఖంగా హామీ ఇచ్చారు. మిరుదొడ్డి మండలంతో పాటు నూతనంగా ఏర్పడ్డ అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని రోడ్లన్నీ అధ్వానంగా మారాయని వాటిని పట్టించుకునే వారు కరువయ్యారని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలమల్లేశంగౌడ్, మోతె సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ఆర్అండ్‌బీ, ఏఈ పీఆర్ అధికారులను నిలదీశారు. ఇరు మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు మంజూరైన నిధులతో త్వరలో పనులు ప్రారంభించి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ, ఏఈ పీఆర్ అధికారులు సమాధానం ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సూకూరి లక్ష్మిలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, తహసీల్దార్ ఉదయశ్రీ, ఎంఈఓ ప్రభుదాసు, ఏఎంసీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలకు సేవచేసే నాయకుడిని ఎన్నుకోవాలి

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొముర‌వెల్లి(సిదిపేట): ప్రజలకు సేవ చేసే నాయకుడని ఎన్నుకోవాలని, స్థానికేతరులతో జనగామ నియోజిక వర్గ ప్రజలకు నష్టం వాటిల్లిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండలంలో హత్ సే హాత్ జోడో అభియాత్ర మండలంలోని కొమురవెల్లి ,రసులాబాద్ ,అయినాపూర్, గురువన్నపేట ,పోసాన్‌పల్లి, రాంసాగర్ గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. స్థానికేతర నాయకులతో జనగామ నియోజిక వర్గం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఈసారి స్థానిక నేతలున్న కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అధికారులకు పోస్టింగులు ఇప్పిస్తు డబ్బులు దండుకుంటున్నాడని ఆరోపించారు.

మహిళలకు సావిత్రిబాయి పూలే ఆదర్శం



చిన్నకోడూరు(సిద్దిపేట): సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


బెజ్జంకి(సిద్దిపేట): సావిత్రి, పూలే విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న నాయకులు


దుబ్బాకలో..


కోహెడలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళ అభ్యున్నతికి నిరంతరం పాటుపడిన ధీరవనిత సావిత్రిబాయి పూలే అని బీఎస్పీ జిల్లా కన్వీనర్ యాదగిరి అన్నారు. శుక్రవారం పార్టీ సిద్దిపేట కార్యాలయంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

బెజ్జంకి(సిద్దిపేట): సావిత్రి బాయి పూలే 126వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బెజ్జంకిలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బొనగిరి శ్రీనివాస్, స్వేరోస్ జిల్లా కోఆర్డినేటర్ బాబు, మాల తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: సమాజాన్ని పట్టి పీడిస్తున్న సామాజిక అసమానతలను రూపుమాపాలని, సామాజిక మార్పు కోసం పూలే దంపతులు తమ జీవితాన్ని త్యాగం చేశారని నాయకులు బండారు రాజు అన్నారు. శుక్రవారం సావిత్రి బాయి పూలే వర్ధంతిని సంర్భంగా దౌల్తాబాద్‌లో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోహెడ(హుస్నాబాద్): సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని దళిత సంఘాల ఐకాసా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కోహెడలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళల హక్కుల కోసం వందేళ్ల క్రితమే పోరాడిన తొలి తరం మహిళా ఉపాధ్యాయురాలు, భారత దేశం గర్వించదగ్గ మహిళ సావిత్రిబాయి పూలే అని ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగెం మధు, జేరిపోతుల జనార్దన్ అన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ, రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్, అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకి నివాళులర్పించారు.

గజ్వేల్‌రూరల్: మహిళలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని చైతన్యవంతులు కావాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని అనంతరావుపల్లిలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

సిద్దిపేటఎడ్యుకేషన్: మహిళల హక్కుల కోసం పోరాడిన తొలితరం మహిళా ఉపాధ్యాయురాలు, దేశం గర్వించదగ్గ మహిళ సావిత్రి బాయిపూలే అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, జనార్దన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో శుక్రవారం పూలే 126వ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..


నంగనూరు(సిద్దిపేట): విద్యార్థులతో ఉపాధ్యాయులు


మల్లారం ప్రాథమిక పాఠశాలలో..


ఖాతా ప్రాథమికోన్నత పాఠశాలలో..

నంగునూరు(సిద్దిపేట): మండల పరిధిలోని తిమ్మాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యాధికారిగా చరణ్, హెచ్‌ఎంగా నవ్యశ్రీ, ఉపాధ్యాయులుగా నక్షత్ర, సింధుజ, అక్షర, రాకేశ్, రవళి, రజనీకాంత్ వ్యవహరించారు.కార్యక్రమాన్ని హెచ్ఎం కృష్ణమూర్తి, పర్యవేక్షించారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మల్లారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి ఆంజనేయులు, ఎంపీటీసీ బాలయ్య, హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ భూమయ్య, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుబ్బాక: తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మితమవుతుందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. దుబ్బాకలోని గాయత్రి వివేకానంద విద్యాలయంలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి హాజరై బహుమతులు అందజేశారు.

నంగునూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఖాతా ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు మోహన్, యాదవరెడ్డి, గోవర్దన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ హైస్కూల్ (సీఎం కేసీఆర్ చదువుకున్న పాఠశాల)లో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులను హెచ్ఎం గాజుల రామచంద్రం, ఉపాధ్యాయులు అభినందించారు.


దుబ్బాకలోని గాయత్రీ వివేకానంద విద్యాలయంలో..

రైతు సమస్యల పరిష్కారానికి దీక్ష


వినతి పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొండపాక(గజ్వేల్): రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిపై బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం కుకునూరుపల్లి తహసిల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ అధ్యక్షుడు మన్నెం శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మోర్చా అధ్యక్షుడు కొలిపాక రాజు మాట్లాడారు. రైతు రాజ్యమంటూ గొప్పలు చెప్పుకుంటున్న కేసీఆర్ సర్కార్ రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చినా రైతు రుణమాఫీ అమలు చేయలేక పోవడం దారుణమన్నారు. అనంతరం తహసిల్దార్‌కు వినతి పత్రంను అందజేశారు.

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఉన్నప్పుడే సాధికారిత సాధ్యం


మాట్లాడుతున్న న్యాయవాది రాధిక

ములుగు(గజ్వేల్): మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఉన్నప్పుడే వారు సాధికారిత సాధించేందుకు వీలు కలుగుతుందని తెలంగాణ హైకోర్టు న్యాయవాది దండా రాధిక అన్నారు. ములుగులోని తెలంగాణ రాష్ట్ర కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.నీరజాప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారిత సాధిస్తేనే దేశం ప్రగతి సాధించినట్లన్నారు. మహిళలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి తోటి మహిళలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు గిర్‌వాణి, రాజశేఖర్, శ్రీనివాసన్, నాగేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస వేతన స్కేలు అమలు చేయాలి


వినతి పత్రం అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి వారికి కనీస వేతన పే స్కేలు అమలు చేయాలని ఎమ్మార్సీ ఉద్యోగులు కోరారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, డీసీసీబీ మెదక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ బక్కి వెంకటయ్యకు శుక్రవారం మిరుదొడ్డిలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ప్రమాద బీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ ఉద్యోగులు కిష్టయ్య, మహేష్, మథిన్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **రాహుగ్రహ దోష నివారణ పూజలు**
కొండపాక(గజ్వేల్): మండల పరిధి మర్పడ్గలోగల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి ఆలయంలో కాల సర్ప దోష, రాహు కేతు పూజలు నిర్వహించారు. ఈనెల 13వ తేదీన రాహువు నక్షత్రం శతభిషంలోకి శని సంచరిస్తుండటమేకాక తృతీయ దృష్టి కుజ క్షేత్రమైన మేషంలో ఉన్న రాహువుపై ప్రసరించనుందన్నారు.

◆ **జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక**
చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు(ఎన్ఎంఎంఎస్) ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలకు చెందిన భవిత, ప్రజ్వల్, సమీర్ బాబ, సంకీర్తన్, ప్రణయ్ చంద్రలు ఎంపికయ్యారు.

◆ **శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం**
చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సోమవారం శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి తెలిపారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోళ్లు సోమ, మంగళ, బుధవారాల్లో జరుగుతాయని తెలిపారు. నాణ్యమైన శనగలు తెచ్చి రూ.5,335 మద్దతు ధర పొందాలన్నారు.

◆ **వధూవరులకు ఆశీస్సులు**
సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన ఓ వివాహనికి సినీనటి, మాజీ ఎంపీ విజయశాంతి హాజరయ్యారు. స్థానిక తాడూరి బాలాగౌడ్ గార్డెన్స్‌లో జరిగిన పెండ్లికి ఆమె హాజరై వధువరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు ఆమెతో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

◆ **లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు**
దుబ్బాకటౌన్: 2022–23కు గాను మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 13వ తేదీన దుబ్బాక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కరశర్మ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు దరఖాస్తుదారులు అన్ని పత్రాలతో హాజరుకావాలన్నారు.

◆ **వసతులు కల్పించాలి**
నంగునూరు(సిద్దిపేట): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని తహసీల్దార్ దిలీప్‌నాయక్ హెచ్‌ఎంలకు సూచించారు. శుక్రవారం అక్కెనపల్లి మోడల్‌స్కూల్, రాజగోపాల్‌పేట, నంగునూరు ఉన్నత పాఠశాలలను ఎస్ఐ మహిపాల్‌రెడ్డితో కలసి సందర్శించారు. పాఠశాల మౌలిక వసతుల గురించి హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు.

◆ **టీఎస్‌యూటీఎఫ్ ఎన్నికల ప్రచారం**
దుబ్బాక: ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు పీఆర్సీ వర్తించేందుకు టీఎస్‌యూటీఎఫ్ ఎన్నో పోరాటాలు చేసిందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న పాపన్నగారి మాణిక్‌రెడ్డిని మొదటి ప్రాధన్యత ఓటు వేసి గెలిపించాలంటూ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

◆ **మృతుల కుటుంబానికి ఆర్థిక సహాయం**
చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరులో గురువారం ప్రమాదవశాత్తు చెరువునీటిలో మునిగి మృతి చెందిన తండ్రి కొడుకుల కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పరామర్శించారు. మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించాడు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి తదితరులు పాల్గొన్నారు.

◆ **టై, బెల్టుల అందజేత**
హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు అరుణ టై, బెల్టులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొమ్మగాని శ్రీనివాస్, ఉపాధ్యాయుడు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మిత్రుడి కుటుంబానికి చేయూత**
చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఉల్లెంగుల సిద్దేశ్వర్ కుటుంబాన్ని 1992–93 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు చేయూత అందించారు. సిద్దేశ్వర్ కూతురు పేరిట చేసిన రూ.35వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని శుక్రవారం అందజేశారు.

◆ **పల్లెల అభివృద్ధికి సర్కారు కృషి**
చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లెల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఉమేష్ చంద్ర, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. చిన్నకోడూరు పెద్దమ్మ దేవాలయం సమీపంలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, శారద రమేష్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ **ఢిల్లీ దీక్షలో గజ్వేల్ ఎంపీపీ**
గజ్వేల్‌రూరల్: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఎమ్మెల్సీ కవిత చేపట్టిన దీక్షలో గజ్వేల్ ఎంపీపీ దాసరి అమరావతిశ్యామ్‌మనోహర్ పాల్గొన్నారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు దూసుకుపోతున్నారన్నారు. కేంద్రం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.

◆ **పాపం వృద్ధురాలు**
నారాయణఖేడ్: పట్టణంలోని బసవేశ్వర చౌక్ వద్ద మూడు రోజులుగా వృద్ధురాలు(90) పడుకొని ఉంది. ఆమె ఎక్కడి నుంచి వచ్చిందో తెలియడం లేదు. స్థానికులు ఆమె మాట్లాడి వివరాలు తెలుసుకునేందుకు యత్నించారు. తనకు ఎవరూ లేరని చెబుతూ ఊరు తదితర వివరాలు తెలపడంలేదు.

అభివృద్ధి, సంక్షేమానికి తెలంగాణ చిరునామా


సిద్దిపేటలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


కొండపాక(గజ్వేల్): మాట్లాడుతున్న రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్


సిద్దిపేట రంగధాంపల్లిలో..

సిద్దిపేటకమాన్: అభివృద్ధి, సంక్షేమానికి తెలంగాణ రాష్ట్రం చిరునామాగా నిలుస్తుందని బీఆర్ఎస్ నాయకులు, దళిత సంఘాల నేతలు అన్నారు. కేబినెట్ సమావేశంలో రెండో విడత దళిత బంధు పథకంలో నియోజకవర్గంలో పదకొండు వందల మందికి లబ్ధి చేకూరడం పట్ల సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మారెడ్డి రవీందర్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, దళిత సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: బడుగు బలహీన వర్గాలకు, పేదలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి పేదల పక్షపాతి అని నిరూపించుకున్నారని బీఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పట్టణ టీఆర్ఎస్వీ అధ్యక్షుడు మహిపాల్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు షాహిద్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేబినెట్ మీటింగ్‌లో ఇల్లు లేని నిరుపేదలు సొంత స్థలాలలో ఇల్లు నిర్మించుకోవడానికి గృహలక్ష్మి పథకం కింద నిధులు కేటాయించడం గొప్ప విషయమన్నారు.

కొండపాక(గజ్వేల్): గృహలక్ష్మి పథకం అమలుతో పేదలకు సొంతింటి కల నెరవేరుతుందని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద సర్పంచ్‌లు అమ్ముల రమేశ్, పుల్లోజు కిరణ్‌కుమార్‌చారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గృహలక్ష్మి పథకాన్ని మొదటగా పైలెట్ ప్రాజెక్ట్‌గా అర్హుల్లో ఒకొక్కరికి రూ.3 లక్షల చొప్పున 4 లక్షల మందికి వర్తింప చేసేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. గృహలక్ష్మి పథకం అమలుకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మంచాల కనకరాంలు, ఆరుట్ల కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్: తెలంగాణ కేబినెట్ నిర్ణయాలు ప్రజల ఆకాంక్షల మేరకు ఉన్నాయని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. పేదలు ఎదురుచూస్తున్న గృహనిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షల సాయం ప్రకటించడం హర్షనీయమన్నారు. దళిత బంధు 1.30 లక్షల మందికి వర్తింపజేయడానికి నిర్ణయించడం గొప్ప పరిణామమన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దళిత బంధు రెండో విడత ప్రకటనతో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి పాడుపడుతోందని నిరూపితమైందని పట్టణ దళిత నాయకులు అన్నారు. శుక్రవారం సిద్దిపేట మున్సిపాలిటీ రంగధాంపల్లి అమరవీరుల స్తూపం ఆవరణలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు.